క్లుప్తంగా

సెయింట్ థెరిస్సా కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ విద్యార్థుల నుంచి హాల్ టిక్కెట్ల కోసం రూ. 100 వసూలు చేస్తున్న నగరంలోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలోని సెయింట్ థెరిస్సా జూనియర్ కళాశాలతో పాటు జిల్లాలోని పలు ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుంచి హాల్ టికెట్ కోసం రూ. 100 వసూలు చేస్తున్నారని ఇవ్వకపోతే హాల్ టికెట్ ఇవ్వమంటూ బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన లింక్ ద్వారా హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకున్నా ప్రిన్సిపల్ సంతకం లేనిదే పని చేయదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను బెదిరిస్తున్నారన్నారు. తక్షణమే ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పందించి కళాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అర్హులందరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ సూచించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక సెయింట్ థెరీసా మహిళా డిగ్రీ కళాశాలలో ఓటు ప్రాముఖ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట లక్ష్మమ్మ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందడానికి అర్హులన్నారు. ఓటు హక్కు పొందడంతో పాటు దాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ అద్దాలు పగులగొట్టిన మందుబాబు

ఏలూరు టౌన్: స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజీ రోడ్డులో ఒక వ్యక్తి మద్యం మత్తులో ఫోన్ మాట్లాడుతూ వ్యానుకు అడ్డురావడంతో హారన్ కొట్టాడని ఆగ్రహించిన వ్యక్తి ఇటుక రాయి పట్టుకుని వ్యాను అద్దం పగులగొట్టి విధ్వంసం సృష్టించాడు. మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన బలే రఘువర్మ, అతని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి బలివే తిరునాళ్లకు వెళ్లేందుకు రఘువర్మ తన వ్యానులో ఎక్కించుకుని మంగళవారం సాయంత్రం బయలుదేరాడు. వ్యాను శనివారపుపేట మీదుగా వెళ్లేందుకు ఏలూరు సెయింట్ ఆన్స్ కాలేజీ దాటే సమయంలో ఒక మృతదేహం ఊరేగింపు జరుగుతుంది. మృత దేహం ఊరేగింపు పక్క నుంచి వ్యాను వెళ్తుండగా ఒక యువకుడు స్కూటర్ ఎదురుగా ఫోను మాట్లాడుతూ వస్తున్నాడు. వర్మ హారన్ కొట్టగా ఆగ్రహించిన స్కూటర్ పై వెళ్తున్న వ్యక్తి వ్యానుకు అడ్డంపెట్టి గొడవ పెట్టుకుని ఇటుకరాయి తెచ్చి వ్యాను అద్దం పగులగొట్టేశాడు. ఈ సంఘటనతో వ్యాను డ్రైవర్, వ్యానులోని వారు భయభ్రాంతులకు గురయ్యారు. వ్యాను డ్రైవర్ కూడా అదే ఇటుకతో కొట్టడంతో అడ్డుకున్న మహిళలపై కూడా వీరంగం చేశాడు. అతనికి తోడు మరో తాగుబోతు వచ్చి బండబూతులు తిడుతూ ఇది తమ రోడ్డు అంటూ ఏలూరు నగరం నుంచి ఎలా వస్తావు? అంటూ ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో మంటూ వీరంగం చేశారు. బాధితుడు రఘువర్మ ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధ్యాయుడిపై విచారణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇటీవల స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించారని అభియోగాలు ఎదుర్కొన్న సోషల్ స్టడీస్ స్కూల్ అసిస్టెంట్ బీపీ సాల్మన్ రాజుపై మంగళవారం పాఠశాలలో విచారణ నిర్వహించారు. ఆయన ప్రవర్తనపై ఫిర్యాదు చేసిన 8, 9, 10 తరగతుల విద్యార్థినులతో పాటు హిందీ ఉపాధ్యాయురాలు శ్రీదేవి నుంచి వాఙ్మూలాలు సేకరించారు. జిల్లా శిశు సంరక్షణాధికారి సీహెచ్ సూర్యచక్రవేణి, బాలికల అభివృద్ధి అధికారి నవీన విచారణాధికారులుగా వ్యవహరించారు. నివేదికను కలెక్టర్‌కు రెండు రోజుల్లో సమర్పించనున్నట్లు విచారణాధికారి సూర్యచక్రవేణి తెలిపారు.

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

శివాలయాల వద్ద ప్రత్యేక అభిషేకాలు, దర్శనాలకు ఏర్పాట్లు



చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం బయట టెంట్ వేసిన దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహాశివరాత్రి పండుగను వైభవంగా నిర్వహించడానికి నగరంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని పలు శివాలయాల్లో ఇప్పటికే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి భక్తులకు నీడ కోసం పందిళ్లు వేశారు. స్థానిక పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామి వారి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.21 గంటలకు శివజ్యోతి కార్యక్రమం, 7.20 గంటలకు స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 10.17 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.

పవర్‌పేటలో

పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు పంచామృతాలతో, పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో మహారుద్రాభిషేకం నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటల నుంచి 12 గంటల వరకూ లింగోద్భవ కాలంలో స్వామి వారికి 516 కేజీల పంచదారతో మహా శర్కరాభిషేకం నిర్వహించనున్నారు. రాత్రి 12 గంటలకు 27 హారతులతో స్వామి వారికి విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.

దొండపాడులో..

స్థానిక దొండపాడు దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం నిర్వహించనున్నారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, 6 గంటల నుంచి మహన్యాస పారాయణ అనంతరం ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రదోషకాల అభిషేకాలు, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత రుద్రహోమాలు అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్వతీ కళ్యాణం, అనంతరం లక్ష బిల్వార్చన , రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకూ భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అగ్రహారంలో..

అగ్రహారంలోని శ్రీ గంగా, వింధ్యవాసినీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము 4 గంటల నుంచి 11 గంటల వరకూ స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకూ తిరిగి అభిషేకాలు అనంతరం అలంకరణ చేస్తారు. రాత్రి 6 గంటలకు స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించి రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవ కాలంలో రాత్రి 12 గంటలకు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. వీటితో పాటు స్థానిక దక్షిణపు వీధిలోని శ్రీ మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేటలోని శ్రీ పర్వతవర్ధని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లో సైతం విశేష పూజలకు ఏర్పాట్లు చేశారు.

మధ్యతరగతి ప్రజల కోసమే కేంద్ర బడ్జెట్


సదస్సులో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్

ఏలూరు (టూటౌన్): కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజల కోసమే అన్నట్టు ఉందని పలువురు జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని అంబికా ఫ్లేవర్స్ కాన్ఫరెన్స్ హాలులో ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మంగళవారం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో వారు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ వల్ల దశాబ్దకాలంగా దేశం ఎంతో పురోగతి సాధించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావు, పత్సమట్ల ధర్మరాజు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జానపద సంస్కృతి వారసత్వ సంపద


సదస్సులో మాట్లాడుతున్న ఆచార్య అయ్యగారి సీతారత్నం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జానపద సంస్కృతి అనేది గ్రామీణ ప్రాంతాలలోని చిన్నచిన్న జాతీయ సమూహాల సాంప్రదాయ పద్ధతులు, ఆచారాలు, నమ్మకాలను ప్రతిబింబిస్తుందని, ఇది మన వారసత్వ సంపద అని ఆంధ్ర విశ్వ కళా పరిషత్ ఆచార్యుడు అయ్యగారి సీతారత్నం తెలిపారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా కళాశాలలో జానపద సంస్కృతి - సాహిత్యం అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న సీతారత్నం మాట్లాడుతూ జానపద సంస్కృతి, సాహిత్యం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విశాఖపట్నంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల హిందీ రీడర్ పీకే జయలక్ష్మి మాట్లాడుతూ జానపద సంస్కృతి స్థానిక వాతావరణంతో బలంగా ముడిపడి ఉంటుందని, ఆ సమాజం చారిత్రక అనుభవాలు, సామాజిక విలువలను ప్రతిబింబింప చేస్తుందన్నారు. కళాశాల సుపీరియర్, కరస్పాండెంట్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెస్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కరోనా మహమ్మారి సమయంలో మానవజాతి జానపదుల జీవన విధానం నుంచి ఎంతో నేర్చుకుందన్నారు. కళాశాల ప్రధానాచార్యులు సిస్టర్ మెర్సీ, హిందీ తెలుగు విభాగాధిపతి సీహెచ్‌వీ మహాలక్ష్మి, తెలుగు అధ్యాపకులు వై.అరుణ ఝాన్సీ రాణి, కె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు పనివారలకు కుదిరిన వేతన ఒప్పందం


వేతన ఒప్పందంపై చర్చలు చేస్తున్న పొగాకు యజమానులు, కార్మికులు, యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పొగాకు పనిచేసే కార్మికులకు 2025 మార్చి ఒకటి నుంచి 2027 ఫిబ్రవరి 28 వరకు రెండు సంవత్సరాలపాటు వేతనాల పెంపు అగ్రిమెంట్ మంగళవారం జరిగింది. ప్రస్తుతం ఇస్తున్న మజూరులపై 16 శాతం పెంచుతూ వేతన ఒప్పందం జరిగిందని పొగాకు పనివారల సంఘం(ఏఐటీయూసీ అనుబంధం)గౌరవ సలహాదారులు బండివెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక టూబాకో మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో అసోసియేషన్ నాయకులు, సభ్యులు మరియు ఏలూరు పట్టణ పొగాకు పనివారల సంఘం నాయకులు, కమిటీ సభ్యుల సంయుక్త సమావేశంలో వేతన ఒప్పందం చేసుకున్నారు. పొగాకు కొట్టుల్లో పనిచేస్తున్న కార్మికుడు ఎవరైనా చనిపోతే ప్రస్తుతం ఇస్తున్న రూ.15 వేలకు బదులు రూ.18 వేలు ఇచ్చేందుకు పొగాకు వ్యాపారస్తులు అంగీకరించారు. ప్రతి సంవత్సరం సంక్రాంతికి కార్మికులకు చెల్లిస్తున్న గ్రాడ్యుటీ రూ. 1500 బదులు 1800 రూపాయలు చెల్లించేందుకు పొగాకు వ్యాపారస్తులు అంగీకరించినట్లు బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ వేతన ఒప్పందం 2027 ఫిబ్రవరి 28 వరకు అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు పట్టణ టూబాకో మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఎస్‌వీ మాధవరావు, కార్యదర్శి బీవీ రామయ్య, నాయకులు ఎస్వీఎస్ ప్రకాశరావు, చాగంటి రామారావు, నాగం శివ, కొండేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్ఐఓకు వినతిపత్రం అందచేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహానుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ మార్చి 1 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు మొదలవుతున్న నేపథ్యంలో సమస్యాత్మక పరీక్ష కేంద్రాలుగా ఉన్న వాటిపైన ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఎక్కడా వివాదాలు రాకుండా పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని కోరారు. నగర ప్రధాన కార్యదర్శి ఎస్.సునీల్ కుమార్ మాట్లాడుతూ 2024-2025 విద్యా సంవత్సరం ఇంకా పూర్తికాకుండానే వచ్చే విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ బోర్డు నుంచి ఇంకా ఎటువంటి అనుమతులు రాకపోయినప్పటికీ జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని, ఈ విధంగా నిబంధనలు ఉల్లంఘిస్తూ అడ్మిషన్లు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫీజు చెల్లించని కారణంగా జిల్లాలో అక్కడక్కడ విద్యార్థులను యాజమాన్యాలు హాల్ టికెట్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాయని వాటిపై కూడా అధికారులు దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు వై. యశ్వంత్, మేడ మహేష్, సీహెచ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ విధులకు వెళ్తూ హోంగార్డు మృతి


మృతి చెందిన రమేష్

ఏలూరు టౌన్: ఏలూరు హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న హోమ్‌గార్డు రమేష్ అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. ఏలూరు టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. ఏలూరు నగరానికి చెందిన పెద్దిబోయిన రమేష్ (39)ఏలూరు హోంగార్డ్ విభాగంలో పని చేస్తున్నాడు. రమేష్ 2003 నుంచి హోంగార్డు విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. శివరాత్రి సందర్భంగా పట్టిసీమ బందోబస్తు విధులకు హాజరయ్యేందుకు మంగళవారం అతను బయలుదేరాడు. ఫైర్ స్టేషన్ ఎన్టీఆర్ విగ్రహం వద్దకు వచ్చేసరికి హఠాత్తుగా గుండెపోటు రావడంతో అతను పక్కనే ఉన్న సిమెంటు బల్లపై కుప్పకూలాడు . తీవ్ర అస్వస్థతతోఅక్కడికక్కడే మృతి చెందాడని సమాచారం. అందుకున్న టూటౌన్ ఎస్సై నాగ కళ్యాణి, త్రీటౌన్ ఎస్సై రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గత కొంతకాలంగా రమేష్ అనారోగ్య కారణాలతో బాధపడుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో స్టాండ్‌ను తొలగించడం దుర్మార్గం



ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఏలూరు (టూటౌన్): అద్దెలు వస్తాయంటూ ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఉన్న ఆటో స్టాండ్‌ను మంగళవారం ఉదయం మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి జే గోపి తీవ్రంగా ఖండించారు. ఆటో స్టాండ్ తొలగింపుకు నిరసనగా మున్సిపల్ ఆఫీసు గేటు ముందు ఆటో డ్రైవర్లు బైఠాయించారు. ఈ ధర్నాలో జె.గోపి మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఉన్న ఆటో స్టాండ్‌ను నగరపాలక సంస్థ అధికారులు అక్రమంగా తొలగించారని విమర్శించారు. వాణిజ్య అవసరాలకు మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న పార్కును నర్సరీలకు, ఇతర వ్యాపార సంస్థలకు ఇవ్వడం కోసం ఆటో స్టాండ్ ను తొలగించడం దారుణమని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్లకు ఒరిగిందేమీ లేదని, మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఆటో స్టాండ్ తొలగింపు ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు సీఐటీయూ ఏలూరు నగర కార్యదర్శి వైయస్ కనకారావు మద్దతు తెలియజేశారు. ధర్నా అనంతరం మున్సిపల్ కమిషనర్ భాను ప్రకాష్‌కు యూనియన్ నాయకులు సిహెచ్ అమర్ కుమార్, అద్దాల నాని, బి చంద్రశేఖర్, రాజారావు, పి సుందర్రావు, ఎస్ వైష్ణవ్, కోలా రాజా త్రినాథ్ తదితరులు వినతిపత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో రామకోటి పూజలు


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న వాసుదేవ శాస్త్రి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 93వ వార్షిక రామకోటి మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కళ్యాణ ం నిర్వహించారు. మాఘ బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఉదయం 10 గంటలకు వేమా వెంకట సురేష్ కుమార్ దంపతుల ఆధ్వర్యంలో రామకోటి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు నగరానికి చెందిన పట్టాభిరామ భజన మండలి ఆధ్వర్యంలో విష్ణు సహస్రనామ పారాయణ, హరే శ్రీనివాస గీతాలాపనలు చేశారు. సాయంత్రం 5.30 గంటలకు అనంతపురానికి చెందిన వాసుదేవ శాస్త్రి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన బంగారు బృంద శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

బాలలకు నైతిక ప్రవర్తన నేర్పాలి

ఏలూరు రూరల్: చిన్నతనంలోనే బాలలకు మంచి అలవాట్లు నేర్పిస్తే నైతిక ప్రవర్తన అలవడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక శనివారపుపేట జడ్పీ పాఠశాలలో 6వ రోజు జరుగుతున్న అంగన్‌వాడీ టీచర్ల, వర్కర్లు ప్రీ-ప్రైమరీ శిక్షణ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో పిల్లల మెదడులో నిక్షిప్తమైన విషయాలు జీవితాంతం గుర్తుండిపోతాయన్నారు. అందువల్ల ఈ దశలో విద్య కృత్యాధార విధానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో మానటరింగ్ ఆఫీసర్ రామారావు, హెచ్ఎం జి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్ నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్ కుమార్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధన సాగించాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.పంకజ్ కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌లో మంగళవారం పాల్ ల్యాబ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పీఏఎల్)పై 348 ఏపీ రెసిడెన్షియల్ సాంఘిక సంక్షేమ పాఠశాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ల్యాబ్ ట్రైనింగ్ నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లాలోని మొత్తం 11 పాఠశాలల ప్రిన్సిపాల్స్, గణితం, ఆంగ్ల, తెలుగు ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారన్నారు. జిల్లాలో గతంలో 18 ల్యాబ్‌లు వుండగా ప్రస్తుతం అదనంగా మరో 14 ల్యాబ్‌లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు లెక్కలు, ఇంగ్లీష్, తెలుగు పాఠ్యాంశాలను సులభంగా పజిల్స్ రూపంలో నేర్చుకునేలా ఈ పాల్ ల్యాబ్‌లోని ట్యాబ్‌లు ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష పాల్ కో ఆర్డినేటర్ బీ. కిషోర్ బాబు, జిల్లా పాల్ డీఎస్ఓ. జీ. శ్రీహరి ఏలూరు ఉపవిద్యాశాఖాధికారి ఏ. రవి ప్రకాష్, ఏలూరు మండల విద్యాశాఖాధికారి-2 డీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్ఈఎల్ స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	31
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

బలివే వంతెన.. వైఎస్సార్‌సీపీ హయాంలో సాకారం

- తీరిన రెండు జిల్లాల ప్రజల చిరకాల వాంఛ
- రూ.18.33 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి


వంతెన మ్యాప్‌ను పరిశీలిస్తున్న అబ్బయ్యచౌదరి (ఫైల్)


సిద్ధమైన బలివే వంతెన

పెదవేగి : దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన బలివే క్షేత్రానికి వంతెన నిర్మించి 25 గ్రామాల ప్రజల కష్టాలు తీర్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికే దక్కిందని ప్రజలు అడుగడుగునా హర్షం వ్యక్తం చేస్తూ నీరజనాలు పలుకుతున్నారు. ఎంతో వ్యయప్రయాసలతో వంతెన నిర్మాణం చేపట్టి అది పూర్తయ్యేందుకు అబ్బయ్యచౌదరి చేసిన అవిరళ కృషిని ప్రజలంతా మరచిపోలేదు.

కూటమి ప్రభుత్వానిదే ఘనత అంటూ అసత్య ప్రచారం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధిని సైతం కూటమి నేతలు తామే ఇదంతా చేశామని సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టిన తీరు స్థానికంగా చర్చనీయాంశమై విమర్శలకు తావిస్తోంది. దీంతో సొమ్ము ఒకరిది, సోకు ఒకరిది.. అన్న చందంగా మారిందని పలు గ్రామాల ప్రజలు నవ్విపోతున్నారు.

శరవేగంగా నిర్మాణం పూర్తి

రెండు జిల్లాల ప్రజల చిరకాలకోరికను వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీర్చారని, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో అది సఫలీకృతమైందని స్థానిక ప్రజ లు ముక్తకంఠంతో చెబుతున్నారు. పెదవేగి మండలం విజయరాయి శివారు ప్రఖ్యాతిగాంచిన బలివే వంతెన దశాబ్దాల కలను సాకారం చేస్తూ, రూ.18.33కోట్ల నిధులతో శరవేగంగా నిర్మాణం ప్రారంభించి, పనులు పూర్తి చేయగలిగామని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు.

బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు



అబ్బయ్యచౌదరి ఎమ్మెల్యే అయిన తరువాత సమీప ప్రాంత గ్రామాలకు ఈ బ్రిడ్జి నిర్మాణంతో ఎంతో మేలు జరిగింది. వర్షాకాలంలో తమ్మిలేరుపై తాత్కాలికంగా వేసిన వంతెన కొట్టుకుపోయేది. ఏరుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు రాకపోకలకు 15 నుంచి 20 రోజులు పట్టేది. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేలా వంతెన నిర్మించారు.

– లేగల శివ,ఉప సర్పంచ్, విజయరాయి

ప్రయాణానికి యాతన తప్పింది



బలివేకి వంతెన లేక ఏళ్ల నాటి నుంచి స్కూల్‌కి వెళ్లే విద్యార్థుల దగ్గర నుంచి, వ్యాపారు లు, ప్రజలు నరకయాతన అనుభవించారు. దాదాపు 25గ్రామాల ప్రజల జీవి తాలు మారతాయని, దెందులూరు, నూజివీడు నియోజకవర్గాల ప్రజల చిరకాల వాంఛ తమ్మిలేరుపై వంతెన నిర్మాణ ఘనత జగన్, అబ్బయ్యచౌదరికే దక్కింది. దీన్నికూడా కూటమి నేతలు వారి ఖాతాలో వేసుకుని ప్రచారం చేస్తున్నారు.

– మట్టా శంకర్, విజయరాయి

సుందరంగా స్నాన ఘట్టాలు



2023 డిసెంబర్ సిద్ధం సభలో స్వయానా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ జగన్‌మోహన్, అప్పటి ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి ప్రత్యేక చొరవతో ఫిబ్రవరిలో ప్రారంభించి నాలుగు నెలల్లో దాదాపు పూర్తి చేయించారు. ఏలూరు, కృష్ణా జిల్లాలనుంచి బలివే భక్తులు స్నాన ఘట్టాలులేక చాలా యాతనపడేవారు. నేడు సుందరంగా స్నానఘట్టాలు సిద్ధమయ్యాయి.

– జానంపేట బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, పెదవేగి